క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాత్యాయిని పూజలు

నాతవరం : మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్ధిపట్నం గ్రామంలో శ్రీదుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు శ్రీసత్యనారాయణమూర్తి శర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరిస్వామికి, ఆంజనేయస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కాత్యాయిని పూజలు నిర్వహించారు.

4న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కె.కోటపాడు : మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 4న బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. 4న ఉదయం 10 గంటలకు కె.కోటపాడు, గోవాడ ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాకలిగిన దరఖాస్తుదారులకు, మధ్యాహ్నం 2 గంటలకు ఏపీజీవీబీ చౌడువాడ, కె.కోటపాడు, ఆనందపురం బ్యాంక్ ఖాతా కలిగిన దరఖాస్తుదారులతో పాటు లంకవానిపాలెం ఇండియన్ బ్యాంక్ ఖాతా కలిగిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

కొత్తగా ఆరు పింఛన్ల పంపిణీ



కె.జె.పురం సచివాలయంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో కొత్తగా ఆరు వితంతు పింఛన్లను మంజూరు చేశారు. కె.జె.పురం గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ జామి రమణబాబు చేతుల మీదుగా పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. వార్డు సభ్యులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 23 వరకు ఇంటర్ అకడమిక్ తరగతులు

నర్సీపట్నం : ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 2025–26 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి ఏప్రిల్ 1వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శోభ తెలిపారు. విద్యార్థులు విధిగా తరగతులకు హాజరు కావాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీ నుంచి అడ్మిషన్లు, బ్రిడ్జి కోర్స్ తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు.

కుసుర్లపూడి పాలకేంద్రం అధ్యక్షుడిగా కాశీ



కాశీని సత్కరిస్తున్న ఏరియా కార్యదర్శి, విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ

రోలుగుంట : కుసుర్లపూడి పాలకేంద్రం అధ్యక్షుడిగా కాశీని నియమించినట్టు రోలుగుంట మండల ఏరియా విశాఖ డెయిరీ కార్యదర్శి రాంబాబు ప్రకటించారు. పాలకేంద్రం అధ్యక్షుడు పెద్దినాయుడు మృతితో అతని కుమారుడు కాశీని డెయిరీ అధ్యక్షుల ఆమోదం, స్థానిక పాలకేంద్రం కమిటీ తీర్మానంతో అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని విలేకరులకు తెలిపారు. అనంతరం సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, కార్యదర్శి రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు కాశీని శాలువాతో సత్కరించారు.

వేతనదారులు 100 ఉపాధి పనిదినాలు పూర్తి చేయాలి



వారాడలో ఉపాధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : ఉపాధి వేతనదారులు తప్పనిసరిగా 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. వారాడలో మంగళవారం ఆమె పంట కాలువల్లో పూడికతీత పనుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ వేతనదారులు గరిష్ట వేతనం రూ.307 పొందేలా పనులు చేపట్టుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా పనుల ప్రాంతాల్లో నీడ ఏర్పాటు చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలని, వేతనదారులు పనుల సమయాల్లో మంచి నీటిని తమ వెంట తీసుకొని రావాలని పూర్ణిమాదేవి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య, ఉప సర్పంచ్ గోవింద, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి సరోజిని పాల్గొన్నారు.

చల్లచల్లని కూల్ కూల్..



పుచ్చకాయల విక్రయిస్తున్న దృశ్యం

చోడవరం : మండే ఎండల్లో కాస్త చల్లబడేందుకు జనం పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం 38 డిగ్రీల సెల్సియస్‌కు సాధారణ ఉష్ణోగ్రతలు దాటిపోవడంతో జనం వేసవి తాపంతో అల్లాడిపోతున్నారు. ప్రధానంగా ఉష్ణతాపం నుంచి ఆరోగ్యం కాపాడుకోవడానికి చిన్నాపెద్దా అంతా కూల్..కూల్...అంటూ పరుగులు తీస్తున్నారు. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించి వెంటనే కూల్ చేసే లక్షణాలు ఉన్న తాటిముంజులు, పుచ్చకాయలకు బాగా గిరాకీ పెరిగింది. ఈ తాటిముంజులు, పుచ్చకాయలు వేసవి దాహం తీర్చేందుకు ఈ సీజన్‌లోనే మార్కెట్లోకి వస్తాయి. ఈ ఏడాది కూడా తాటిముంజులు, పుచ్చకాయలు ఇప్పటికే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో దొరికే తాటిముంజులకు మరింత గిరాకీ పెరిగింది. తాటి ముంజులను వీధుల్లో తిరుగుతూ అమ్మడంతోపాటు అప్పటికప్పుడే తాటికాయలు కోసి తాజాగా ముంజులు తీసి ఇచ్చేందుకు ప్రధాన రహదారుల పక్కన కొందరు రైతులు అమ్మకాలు ప్రారంభించారు. చోడవరం, అనకాపల్లి, మాడుగుల, సబ్బవరం రోడ్లలో ఎక్కడపడితే అక్కడ తాటిముంజులు విక్రయిస్తున్నారు. వీటి ధరలు కూడా ఎండతో పాటే భగ్గుమంటున్నాయి. గత ఏడాది డజను రూ.20కు విక్రయించే తాటిముంజులు ఈ ఏడాది రూ.30కు అమ్ముతున్నారు. పుచ్చకాయ ధర కూడా పెరిగింది. కిలో రూ.20 నుంచి ఇప్పుడు రూ.25కి పెరిగింది. వేసవి తాపం తీరాలంటే ఈ రెండింటిని తినాలనే ఆరోగ్య సూత్రం వీటికి డిమాండ్ పెంచింది.



తాటి ముంజులు విక్రయిస్తున్న దృశ్యం

గరిశింగి అక్రమ లేఔట్‌లో హెచ్చరిక బోర్డుల తొలగింపు

- స్థానిక టీడీపీ నేత అండతో రియల్టర్ బరితెగింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గరిశింగి లేఔట్‌లో ఆక్రమణ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేసి లేఔట్ కాలువలో పడేసిన రియల్టర్

దేవరాపల్లి : గరిశింగి రెవెన్యూ పరిధిలో జిరాయితీ భూములను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులు ఆక్రమించి లేఔట్ ఏర్పాటు చేశారు. ఈ దురాక్రమణల పర్వంపై 'అధికారం అండగా..అక్రమణలు మెండుగా' శీర్షికతో మార్చి 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే జరిపి ఆక్రమణలు గుర్తించారు. గరిశింగి ఎల్‌పీఎం 78లో కొండవాగులో 16 సెంట్లు, ఎల్‌పీఎం నెంబర్ 70లో పోరంబోకు కొండ 0.054 సెంట్లు, ఎల్‌పీఎం నెంబర్ 69లో గెడ్డ 0.055 సెంట్లు, ఎల్‌పీఎం నెంబర్ 45లో వాగులో 0.032 సెంట్లు, ఎల్‌పీఎం నెంబర్ 49లో గెడ్డ స్థలం 0.11 సెంట్లు మొత్తంగా లేఔట్‌లో 42 సెంట్లు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు నిర్ధారించారు. సదరు స్థలంలో ప్రభుత్వ భూమిగా సూచిస్తూ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అయితే 24 గంటలు గడవక ముందే సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి బరితెగించి ఆ బోర్డులను ధ్వంసం చేసి కాలువలో పడేశారు. అయితే ఆక్రమణ స్థలంలో ఉన్న ప్రహరి మాత్రమే తొలగించి, మిగిలిన ఆక్రమణలు తొలగించక పోవడంపై రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ పి.లక్ష్మీదేవిని వివరణ కోరగా మరలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని, తొలగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

'ఉపాధి' పనులకు భూమి పూజ



డి.యర్రవరంలో ఉపాధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ పుష్ప

నాతవరం : జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ అడిగిన వెంటనే ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తామని ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు అన్నారు. మండలంలో మంగళవారం డి.యర్రవరం పంచాయతీలో సర్పంచ్ ఇనపసప్పల సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు ఇనపసప్పల పుష్ప ఉపాధి హామీ పథకం పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఏపీవో మాట్లాడుతూ మండలంలో 20 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించామన్నారు. మిగతా పంచాయతీలో బుధవారం గురువారం పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఏడాది మండలంలో సుమారుగా 8 లక్షలు పని దినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. అలాగే 31 పంచాయతీలో రూ.14కోట్లు వ్యయంతో మేటీరియల్ రూపంలో వివిధ పనులు చేసేందుకు రూపొందించామన్నారు. ఈ ఏడాది కొత్తగా ఉపాధి నిధులతో రైతులు పంట పొలాల్లో ఫారం పాండ్లు ఏర్పాటు, పశువులకు తాగునీటి ఎద్దడి నివారణకు పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి తాగునీటి కుండీల నిర్మాణం చేస్తామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



డి.గోటివాడలో పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్ : మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం ప్రారంభించారు. వాడపాడులో గొకులం షెడ్డును ప్రారంభించారు. డి. గొటివాడలో పంచాయతీ భవనంను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు పనులకు భూమి పూజ చేశారు. ఎం.కృష్ణాపురంలో సీసీ రోడ్డుతో పాటు కింతలిలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన, సత్యవరంలో సీసీ రోడ్డు, జేజేఎంలో చేపట్టిన వాటర్ ట్యాంకు ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, మండల పార్టీ అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పుప్పాల అప్పలరాజుతో పాటు ఆయా గ్రామాలు సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

మిత్రుల మృతికి పూర్వ విద్యార్థుల సంతాపం



మిత్రుల మృతికి మౌనం పాటించి సంతాపం తెలిపిన పూర్వపు విద్యార్థులు

రోలుగుంట : తమతో కలిసి చదువుకొన్న పలువురు మిత్రుల మృతికి పూర్వ విద్యార్థులందరూ మంగళవారం ఒకచోట కలుసుకొని మౌనం పాటించి సంతాపం తెలిపారు. పెదబొడ్డేపల్లి సెంట్ థెరిసా ఆర్సీఎం పాఠశాలలో అప్పటి నర్సీపట్నం తాలూక పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన 57 మంది విద్యార్థులు 1977 సంవత్సరం వరకూ పదో తరగతి చదివారు. తరువాత విద్యాభ్యాసం వేర్వేరు చోట్ల చదివి వివిధ వృత్తుల్లో ఉన్నారు. అపుడు చదువుకున్న వారిలో ఎస్.ఈశ్వర్రావు, సుర్ల మోహన్ రావు, పిట్టా రామారావు. మేరీ, బంటు సత్యవతి తదితరులు ఒకరి తరువాత ఒకరు గడిచిన సుమారు పదేళ్లలో మరణించారు. ఈ నేపథ్యంలో మంగళవారం తమ చదువుల బడి ఆర్సీఎంలో జరిగిన పదో తరగతి పూర్వపు విద్యార్థులు 27 బ్యాచ్‌ల అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న 1977 బ్యాచ్ పూర్వపు విద్యార్థులంతా ఒక చోట సమావేశమయ్యారు. తమతోటి అప్పటి విద్యార్థి మిత్రుల మృతి గురించి తెలుసుకొని ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. వారి పేర్లతో అమర్ రహే, అమర్ రహే అంటూ నినదించి సంతాపం తెలిపారు. భవిష్యత్‌లో పూర్వ మిత్రులంతా తరుచూ కలుసుకుని యోగక్షేమాల్లో పాలు పంచుకోవాలని తీర్మానించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్ కోర్సు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. అభ్యర్థులు ఎంసీఎ, ఎంటెక్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్‌లో 55 శాతం ఉత్తీర్ణత శాతం సాధించి ఉండాలన్నారు. ఎస్‌ఈటీ, ఎస్ఈటీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికేట్లతో ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం అభినందనీయం



సర్పంచ్ అప్పాజీ, మాజీ సర్పంచ్ బంగారునాయుడును సన్మానిస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : ప్రజల భాగస్వామ్యంతోనే నూతనంగా గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఆలయం నిర్మాణం చేపట్టడంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను జరిపినట్టు సర్పంచ్ వంటాకు అప్పాజి అన్నారు. గ్రామస్తులు నూకాంబికా అమ్మవారి ఆలయ నిర్మాణానికి కృషి చేసిన వారిని సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చిన సత్యవరపు కాశీ విశ్వేశ్వర రావు, సర్పంచ్ వంటాకు అప్పాజి, మాజీ సర్పంచ్ గురు బంగారునాయుడు, ఆలయ శిల్పి చిన్నలను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో దేవతామూర్తుల ఆలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.

ముస్లింలకు విందులో పాల్గొన్న నేతలు



మాడుగుల షాదీఖానాలో ముస్లింలకు విందులో పాల్గొన్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల : మాడుగులలో ప్రతి ఏటా జరిగే విధంగా ఈ ఏడాది కూడా మంగళవారం రాత్రి ముస్లింలకు విందు నిర్వహించారు. రంజాన్ వేడుకలు ముగింపు సందర్భంగా స్థానిక షాదీఖానాలో కో ఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీసా విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్, పెరుమళ్ల వెంకటరావు, బసవా రామ పరమేష్, జామియా అధ్యక్షుడు షేక్ మస్తాన్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కాటపల్లి'కి అంబేడ్కర్ సేవారత్న పురస్కారం



నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి : దేవరాపల్లికి చెందిన దళిత ఉద్యమ నాయకుడు కాటపల్లి అప్పారావు రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవారత్న అవార్డును అందుకున్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉగాది రోజున ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపేటలో డా.బీఆర్.అంబేడ్కర్ ఉగాది పురస్కారాల మహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి అంబేడ్కర్ సేవా రత్న అవార్డును ప్రకటించారు. అందులో భాగంగా ఈ అవార్డును రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు చేతుల మీదుగా అప్పారావుకు అందించారు. మూడు దశాబ్దాలుగా సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమ నేతగా, జర్నలిస్టుగా, ప్రజా గాయకుడిగా కాటపల్లి విశేష సేవలందించారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



కె.జె.పురం పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న భీశెట్టి జగ్గారావు

మాడుగుల రూరల్ : ఈ నెల 17 వ తేదీ నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ద్వారా 710 మంది రెగ్యులర్, 73 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలుకు హాజరయ్యారు. కె.జె.పురం, మాడుగుల బాలుర, బాలికల, పరీక్ష కేంద్రాలతో పాటు ఒమ్మలి హైస్కూలు, తాటపర్తి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. కేజేపురం పరీక్ష కేంద్రం వద్ద గ్రామానికి చెందిన విశాఖ పాలసొసైటీ సిబ్బంది అయిన భీశెట్టి జగ్గారావు సొంత ఖర్చుతో విద్యార్థులకు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

విద్యార్థుల కేరింతలు



దేవరాపల్లి పరీక్ష కేంద్రం వద్ద విక్టరీ సింబల్ చూపిస్తున్న బేతపూడి కేజీబీవీ టెన్త్ విద్యార్థినులు

దేవరాపల్లి : పదో తరగతి పరీక్షలు ముగియడంతో మంగళవారం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెనుగుపూడి డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం వద్ద ఆఖరి రోజు సోషల్ పరీక్ష రాసిన విద్యార్థులు విక్టరీ సింబల్ చూపిస్తూ సందడి చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు సంతోషంగా కనిపించారు. దేవరాపల్లిలోని పరీక్ష కేంద్రానికి ఆర్టీసీ బస్సులో వచ్చిన తెనుగుపూడి గురుకుల విద్యార్థులు బస్సులో కేరింతలతో సందడి చేశారు.

మారేపల్లిలో మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



మారేపల్లిలో మరిడిమాంబను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామంలో మరిడిమాంబ ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాజీ డిప్యూటీ సీఎం బూడిని ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, రిటైర్డ్ ఎంఈవో అవుగడ్డ అప్పలనాయుడు, వెంకటరాజుపురం మాజీ సర్పంచ్ రాజునాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు రామకృష్ణ, ఈర్లె రాము, అప్పలనాయుడు, అప్పారావు, చిన్నంనాయుడు, దేముడుబాబు, సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య క్రైస్తవుల సంఘాల పాస్టర్లు

నర్సీపట్నం: క్రైస్తవ ప్రబోదకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నర్సీపట్నంలో బుధవారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు, క్రైస్తవ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీబీఎం కాంపౌండ్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి, అబిద్‌సెంటర్‌లో మానహారం ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి శ్రీకన్య కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి నిరసన తెలియజేశారు. బిషప్ జీవన్ రాయ్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున, ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. క్రైస్తవులు, మైనారిటీలపై దాడులను అరికట్టాలన్నారు. ప్రవీణ్ పగడాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిజాలు నిగ్గుతేల్చి తక్షణమే దోషులను శిక్షించాలన్నారు. క్రైస్తవులపై ఇటీవల దాడులు పెరిగిపోవడానికి ఈ ఉదంతమే కారణమన్నారు. పాస్టర్లు బెంజిమెన్, బిషప్ డేనియల్, పాస్టర్ కృపారావు, పాస్టర్ ఆశీర్వాదం, జాన్ పీటర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌కు ఉచిత కోచింగ్



మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను

దేవరాపల్లి: ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి ఉచితంగా పాలిటెక్నికల్, ఏపీఆర్‌జేసి కోచింగ్ అందించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను తెలిపారు. దేవరాపల్లిలో మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేవరాపల్లి ఉషోదయ స్కూల్లో ఈ నెల 4 నుంచి ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపక సిబ్బందితో కోచింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించడంలో భాగంగా 2018 నుంచి ప్రతి ఏటా 150 మందికి పైబడి విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కోచింగ్ సెంటర్‌లో మొదట 150 మందికి మాత్రమే కోచింగ్ ఇవ్వబడుతుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫోన్ : 9985250072 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వీరి వెంట ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల ప్రతినిధి గంగవంశం సంతోష్ ఉన్నారు.

94 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ పూర్తి



జేడీపేటలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సారథ్యంలో పంపిణీ చేపట్టారు. మండలంలో 11,521 మందికి 10,829 మందికి పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్టు స్థానిక ఎంపీడీవో కె. అప్పారావు తెలిపారు. 93.99 శాతం మేర పింఛన్లు పంపిణీని మంగళవారం సాయంత్రం వరకు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కె.అప్పారావు జేడీపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్ తదితరులు పాల్గొన్నారు. పింఛన్లు తీసుకోని వారు బుధవారం సాయంత్రం 5 గంటల లోపు తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

సత్యసాయిపై ప్రత్యేక గీతాలాపన కార్యక్రమం

కె.కోటపాడు : వి.సంతపాలెం గ్రామంలో గల రామాలయంలో సత్యసాయిబాబాపై 100 ప్రత్యేక గీతాలాపన కార్యక్రమాన్ని సత్యసాయి భక్తులు మంగళవారం నిర్వహించారు. సత్యసాయిబాబా వారి 100వ జన్మదిన వేడుకలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాజీ సర్పంచ్, సత్యసాయి భక్తుడు వేచలపు సింహాద్రప్పడు(చలం) తెలిపారు. సత్యసాయిపై గీతాలాపన అనంతరం అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ కశిరెడ్డి అప్పలనాయుడు సత్సంగ కార్యక్రమంలో సత్యసాయి నామసంకీర్తన, సేవలు, విశ్వాసం, క్రమశిక్షణపై భక్తులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లెక్కల దేముడునాయుడు, దేవీలత, కన్నూరు అప్పలనాయుడు, నారాయణపాత్రుడు పాల్గొన్నారు.